బీటీ నిర్మాణమెప్పుడో..?

- గుంతలమయంగా బైపాస్ రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట పట్టణంలోని సర్వాపురం బైపాస్ రోడ్డుపై బీటీ నిర్మాణం చేయకపోవడంతో గుంతలమయంగా మారి వర్షాకాలంలో నీళ్లు నిలిచి అటువైపు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి బీటి వేయించాలని ప్రజలు కోరుతున్నారు. నర్సంపేట పట్టణంలోని సర్వాపురంలో 4, 5వ వార్డులను కలుపుకుంటూ పాకాల రోడ్డు నుంచి మహబూబాబాద్ రోడ్డు వరకు తాత్కాలికంగా మట్టితో బైపాస్ రోడ్డు పోసి చేతులు దులుపుకున్నారు. నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డు నుంచి ద్వారకపేట మీదుగా వ్యవసాయ మార్కెట్ కలుపుకొని మహబూబాబాద్ రోడ్డు వరకు పూర్తి సీసీ రోడ్డు వేశారు. ఈరోడ్డు గుండా వాహనాదారులు నర్సంపేటను తాకకుండా వస్తూ మహబూబాబాద్ వైపు వాహనాలన్ని వెళ్లిపోతున్నాయి. ఈ దారిగుండా మహబూబాబాద్ నుంచి పాకాల రోడ్డు వద్దకు తాత్కాలికంగా మట్టిరోడ్డు వేసి చేతులు దులుపుకున్నారు. దీంతో చిన్నపాటి వానలకే రోడ్డు బురదమయం మారడం.. ఈ రోడ్డుకే భారత్ గ్యాస్ ఏజెన్సీ, శ్మశాన వాటిక ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలబారిన పడుతున్నారు. పాకాల రోడ్డు నర్సంపేట పట్టణం తాకకుండా వెళ్లాలంటే ఈబైపాస్ రోడ్డు ఎంతో ప్రధానం. అయినప్పటికీ రోడ్డును ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బైపాస్ రోడ్డుపై బీటీ వేయాలని కోరుతున్నారు.


గుంతలమయంగా మారిన రోడ్డు

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


నల్లబెల్లి: సీమంతం చేస్తున్న ఝాన్సీ రాణి


రాయపర్తి: మాట్లాడుతున్న సర్పంచ్

నల్లబెల్లి: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఝాన్సీ రాణి అన్నారు. పోషణమాసంలో భాగంగా శుక్రవారం నల్లబెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు అంగన్ వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. గర్భిణులు, తల్లులు, కిశోర బాలికలు సమతుల ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆకుకూరలు, పండ్లు, పప్పు దినుసులు ప్రతి రోజూ ఆహారంలో తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ధనలక్ష్మి, సువర్ణ, సువర్ణ, సునిల్, భాగ్యలక్ష్మి, గర్భిణులు నవ్య, కావ్య, రమ్య పాల్గొన్నారు.

కొండూరులో పోషణమాసం కార్యక్రమం

రాయపర్తి: మండలంలోని కొండూరు అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార విలువలపై తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ అంగన్‌వాడీ సెంటర్‌లను ఎర్రబెల్లి ట్రస్ట్‌ఛైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర సరితరవీందర్‌రెడ్డి, ఐసీడీఎస్‌సూపర్ వైజర్ సత్యవతి, అంగన్‌వాడీటీచర్లు సుజాత, ప్రేమలీల, స్రవంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మొబైల్ అప్పగింత

రాయపర్తి : పోగొట్టుకున్న మొబైల్‌ను పోలీసులు బాధితుడికి అప్పగించారు. ఎస్సై దేశిని విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దురిశెట్టి సంపత్ ఇటీవల వరంగల్‌లో మొబైల్ పోగొట్టుకున్నాడు. పోలీస్ స్టేషన్‌లో సీఈఐఆర్‌లో నమోదు చేసుకున్నాడు. పోలీసులు మొబైల్ కనిపెట్టి శుక్రవారం సంపత్‌కు అందజేశారు. సిబ్బంది తూళ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మెపా జిల్లా మీడియా ఇన్‌చార్జ్‌గా రాజు


రాజు

చెన్నారావుపేట: మండలంలోని అక్కల్‌చెడ గ్రామానికి చెందిన ముత్యం రాజును జిల్లా మీడియా ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు మెపా రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు శ్రీనివాస్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్, డాక్టర్ గుండాల మదన్‌కుమార్‌లు శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాజు మాట్లాడుతూ మెపా ఆధ్వర్యంలో ముదిరాజ్ యువకులు, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన మెపా రాష్ట్ర కమిటీతోపాటు జిల్లా బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రబెల్లి గెలుపునకు కృషి చేయాలి

రాయపర్తి: పాలకుర్తి నియోజకవర్గంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని బీఆర్‌ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని గట్టికల్‌తోపాటు తదితర గ్రామాల్లో ఆయన కార్యకర్తలతో సమావేశమై చర్చించారు. అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ అనిమిరెడ్డి, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, బిల్లా సుధీర్‌రెడ్డి, ఆకుల సురేందర్‌రావు, మధు, కాశీనాథం, చిన్నాల శ్రీనివాస్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, దాసరి ముత్తయ్య, దాసరి శ్రీను, ఎల్లస్వామి పాల్గొన్నారు.

పరామర్శ



రాయపర్తి: మండలకేంద్రంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబాలను ఎర్రబెల్లి ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతిచెందిన ఐత యాకయ్య, కొండేటి రత్నం, ఐత చంద్రమ్మ, పంజాల భద్రయ్య కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, బిల్లా సుధీర్‌రెడ్డి, సురేందర్‌రావు, రామచంద్రారెడ్డి, వనజారాణి, నర్సయ్య, రాంచందర్, సత్యం పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

ఖానాపురం: తుంగబంధం కాల్వ సమీపంలోని పాత ఆర్‌అండ్‌బీ రోడ్ స్థలాన్ని ప్రత్యామ్నాయ శ్మశాన వాటికకు కేటాయించాలని సర్పంచ్ శాఖమూరి చిరంజీవి కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేసి, ఆమె మాట్లాడారు. ఖానాపురంలో 8వేలకు పైగా జనాభా ఉన్న నేపథ్యంలో ఒక్క శ్మశాన వాటిక, డంపింగ్ యార్డులు సరిపోవడం లేదన్నారు. గతంలో పాకాల వాగు, పాత బ్రిడ్జి వద్ద మండల ప్రజలకు శ్మశాన వాటిక అందుబాటులో ఉండేదన్నారు. డంపింగ్ యార్డు కూడా అక్కడే వినియోగించుకోవడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం పాత ఆర్‌అండ్‌బీ రోడ్డు స్థలం అన్యాక్రాంతం అవుతుందని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా స్థలాన్ని శ్మశాన వాటిక, డంపింగ్ యార్డుకు కేటాయించి సహకరించాలని కోరారు.

ఎన్నిక

నెక్కొండ: నెక్కొండ పట్టణ ఉస్మానియా మసీద్ నూతన కమిటీ అధ్యక్షుడిగా షేక్ షబ్బీర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం నూతన కన్వీనర్ మహ్మద్ అన్వర్ తెలిపారు. స్థానిక మసీద్‌లో శుక్రవారం సంఘం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారని ఆయన అన్నారు. నూతన కమిటీ ఉపాధ్యక్షుడిగా మహ్మద్ అఫ్జల్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ షెఫిక్, సంయుక్త కార్యదర్శిగా షేక్ అక్బర్, కోశాధికారిగా షేక్ యాకుబ్‌పాషా, కమిటీ సభ్యులుగా అబ్దుల్‌అజాజ్, ఖలీల్, అనుసొద్దీన్, యాకుబ్ పాషా, మెహబూబ్‌పాషా, మదార్ హుస్సేన్, దస్తగిరి, చాంద్‌పాషా, మదార్, అమానుల్లా ఎన్నికయ్యారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ.. మసీద్ అభివృద్ధితోపాటు ముస్లింలకు ప్రభుత్వంనుంచి అందాల్సిన సంక్షేమ, అభివృద్ధి ఫలాల సాధనకు కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పన్నులు వందశాతం వసూలు చేయాలి


పన్నుల వసూలును పరిశీలిస్తున్న ఎంపీఓ

చెన్నారావుపేట: గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలని ఎంపీఓ శ్రీధర్‌రాజు సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఇంటి పన్నుల వసూలు కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించి, మాట్లాడారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పన్నులు వసూళ్ల కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. చెన్నారావుపేట గ్రామంలో రూ.4,480 వసూలు చేయడం జరిగిందన్నారు. ప్రతి కార్యదర్శి 100 శాతం పన్నులు వసూలు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా షాపు నిర్వహించొద్దని తెలిపారు. గ్రామ ప్రజలు సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేందర్, ఎంపీడబ్ల్యూ సురేష్, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యం


చేరిన వారిని ఆహ్వానిస్తున్న మాధవరెడ్డి

నర్సంపేట: ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని కమలాపురంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నర్సంపేట కూరగాయల మార్కెట్ కమిటీ ప్రెసిడెంట్ కంచు రవికుమార్, మాజీ వార్డు మెంబర్లు మద్దికుంట్ల యాదగిరి, అల్లంశెట్టి సోమయ్య, కమలాపురం బీఆర్‌ఎస్ పార్టీ కార్యదర్శి పోతరాజు, బాలరాజు, బత్తిని సాంబయ్యతో పాటు 50కుటుంబాలు శుక్రవారం దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మాధవరెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ తొమ్మిది సంవత్సరాలుగా ప్రజలను మభ్యపెడుతూ ఎన్నికల సమయంలో ప్రజల ఓట్లను దండుకునే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.10లక్షలతో ఆరోగ్యశ్రీ పథకం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, పోటీ పరీక్షలకు విద్యార్థులు, యువతకు రూ.5లక్షల వరకు ఆర్థిక సహకారం, గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని అన్నారు. కమలాపురం గ్రామానికి పూర్తిస్థాయిలో అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సెల్ చైర్మన్ ఓర్సు తిరుపతి, మహిళా జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులను అడ్డుకోవాలి


మాట్లాడుతున్న నర్సంపేట రూరల్ సీఐ కిషన్


నల్లబెల్లి: పోలీసులతో ప్రజలు కలిసి పని చేస్తూ అసాంఘిక శక్తులను అడ్డుకునేందుకు కృషి చేయాలని నర్సంపేట రూరల్ సీఐ కిషన్ అన్నారు. మండలంలోని మేడపల్లిలో గురువారం రాత్రి పోలీస్ కళాజాత నిర్వహించారు. మేడపల్లి, రాంపూర్ జంట గ్రామాల ప్రజలు వారి సమస్యలను సీఐ దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా నిర్వహించిన పోలీస్ కళాజాత ఆకట్టుకుంది. చదువు, రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, బాల్యా వివాహాలు, సైబర్ క్రైం, సీసీ కెమెరాలు తదితర అంశాలపై కళాజాత బృందం పాటలు, నాటికల రూపంలో ప్రజలకు కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శన ఇచ్చారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీసింగ్ బలోపేతానికి కృషి చేస్తుందన్నారు. యువకులు గుట్కా, గంజాయి, డ్రగ్స్‌కు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో రాంపూర్, మేడపల్లి గ్రామాల సర్పంచ్‌లు చింతపట్ల సురేష్, లావుడ్యా తిరుపతి, కళా బృందం ఇన్‌చార్జ్ ఏఎస్సై నాగమణి, హెడ్‌కానిస్టేబుళ్లు ప్రభాకర్, విలియమ్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్స్ రాకేష్, రత్నయ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైనవారికే ‘గృహలక్ష్మి’ వర్తింపజేయాలి


కేంద్ర పథకాలను వివరిస్తున్న విజయ్‌చందర్‌రెడ్డి

సంగెం: పార్టీలకతీతంగా అర్హులైనవారికే గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని బీజేపీ పరకాల ఇన్‌చార్జ్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని షాపూర్‌లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2018 ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.3,116 భృతి, రైతులకు ఇస్తామన్న ఉచిత ఎరువులు ఎటు పోయాయని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ప్రశ్నించారు. బీజేపీకి ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి, జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్, బెజెంకి శేషాద్రి, రహమతుల్లా, వీరయ్య, డీ.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

నర్సంపేట: నిర్మల్ జిల్లా కేంద్రంలో అక్టోబర్ 3వ తేదీన జరిగే గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయాలని మోకుదెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో మోకుదెబ్బ జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకన్నగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కుల దామాషా ప్రకారం చట్ట సభలో అవకాశాల కోసం గౌడ కులస్తులు పోరాటం చేయాలన్నారు. రాష్ట్రంలో 12శాతం ఉన్న గౌడలకు ఏ రాజకీయ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు కేటాయించడం లేదన్నారు. గౌడ కులస్తులు అధిక సంఖ్యలో మహాసభకు హాజరై సత్తా చాటాలని కోరారు. సమావేశంలో మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్, రాష్ట్ర నాయకులు మచ్చిక రాజు, రామగోని సుధాకర్, మాచర్ల ఐలుమల్లు, గంప రాజేశ్వర్, శీలం వీరన్న, మద్దెల సాంబయ్య, దొంతి సంతోష్, నర్సయ్య, జూలూరి హరిప్రసాద్, బొడిగే మల్లేషం పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐని కలిసిన గీత కార్మికులు

చెన్నారావుపేట: నూతనంగా బాధ్యతలు చేపట్టిన నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేష్‌రెడ్డిని ఉప్పరపల్లికి చెందిన గౌడ సంఘం సభ్యులు శుక్రవారం కలిసి సన్మానించారు. గీత కార్మికుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, బొట్టు పెద్ద కార్మిక్, పెద్ద రమేష్, యాకయ్య, నగేశం, ఐలయ్య, రమేష్, శ్రీనివాస్, మొగిళి, కిట్టు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న వినాయక పూజలు


మాదన్నపేట చెరువు కట్టపై భక్తుల పూజలు


నర్సంపేట: కుంకుమ, పువ్వులతో దీపారాధన


నెక్కొండ: మూసినవాడ గణేష్ మండపంలో..

నర్సంపేట: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని 13వ వార్డులో స్వర్ణ భారతి యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కుంకుమ పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా పూల అలంకరణ చేసి దీపారాధన, కుంకుమ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండలో..

నెక్కొండ: మండలంలో గణేష్ మండపాల వద్ద వినాయక నామస్మరణలతో పరిసరాలు మార్మోగాయి. మండల కేంద్రంలోని మూసిన వాడలో కొలువుదీరిన గణేష్ మండపంలో శుక్రవారం వేద మంత్రోచ్ఛరణల మధ్య మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

ఖానాపురం: మండల వ్యాప్తంగా గణనాథుల వద్ద భక్తిశ్రద్ధల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఖానాపురం, ధర్మారావుపేట, బుధరావుపేటతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల వద్ద నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పలు గణనాథుల మండపాల వద్ద కుంకుమ పూజలను పూజారుల వేద మంత్రోచ్ఛరణల నడుమ చేపట్టారు. సాయంత్రం సమయాల్లో మహాఅన్నదాన కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహా అన్నదానం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మాదన్నపేట చెరువు కట్టపై ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఈత సంఘం ఆధ్వర్యంలో గణనాథుడి ఏర్పాటుచేసి పూజలు చేస్తున్నారు. శుక్రవారం ఈత సంఘం గౌరవాధ్యక్షుడు శింగిరికొండ మాధవశంకర్ గుప్త రజని దంపతులు మహా అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈత సంఘం అధ్యక్షుడు కొల్లూరి లక్ష్మీనారాయణ పద్మ, పంబి చంద్రమౌళి, చిదురాల శరత్, ఆకుతోట రాజేందర్ తేజశ్రీ, సారయ్య, గండి సంతోష్, హరియానాయక్, బుచ్చయ్య, మధు, ఆగయ్య, సంపత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడికి భక్తిశ్రద్ధలతో..

రాయపర్తి: మండలంలోని కాట్రపల్లిలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు శుక్రవారం పాల్గొన్నారు. కొలన్‌పల్లిలో నిర్వహిస్తున్న వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు నర్సింహానాయక్, ఎంపీపీ అనిమిరెడ్డి, సురేందర్‌రావు, సతీష్, సర్పంచ్ ఎల్లయ్య, శ్రీధర్, రమేష్, శ్రీనివాస్, సోమన్న, శ్రీను పాల్గొన్నారు.


ఖానాపురంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


కాట్రపల్లిలో వడ్డిస్తున్న ఉషాదయాకర్‌రావు


గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలో పూజ చేస్తున్న చిన్నారులు శశాంక్, రుతిక

సంక్షిప్త సమాచారం

ప్రొసీడింగ్ అందజేత

పర్వతగిరి: మండలంలోని బూర్గుమళ్ల గ్రామానికి చెందిన గౌడ, మహిళా కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి సంబంధించిన రూ.10లక్షల చొప్పున ప్రొసీడింగ్ కాపీని సంఘం బాధ్యులకు ఎమ్మెల్యే ఆరూరి రమేష్ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందిర జితేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ వేణు, రాపాక వెంకట్, జనార్దన్‌రెడ్డి, శ్రీను, రాజశేఖర్, ఎల్లగౌడ్, రామలింగం, పూజారి విజయ్, జ్యోత్స్న, శ్రావణి, కవిత పాల్గొన్నారు.

పరిహారం పూర్తిగా అందలేదు

వర్ధన్నపేట: అకాల వర్షాలతో పంట పూర్తిగా నష్టపోయిన తనకు పరిహారం పూర్తిగా ఇవ్వలేదని మండలంలోని బండౌతపురం గ్రామానికి చెందిన రైతు నక్క యాకయ్యకు వాపోయాడు. వర్ధన్నపేట శివారులో ఉన్న తన నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిలో గత సంవత్సరం రబీలో మొక్కజొన్న పంట వేశాడు. అకాల వర్షాలకు నాలుగు ఎకరాల పంట నేలకు ఒరిగిపోయింది. పంట నష్టంపై మండల వ్యవసాయాధికారులు సర్వే చేస్తున్న క్రమంలో తన మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతిందని తెలిపాడు. పంటకు సంబందించిన ఫొటోలు, వివరాలు కార్యాలయంలో అందజేసినట్లు తెలిపాడు. కానీ, ఇటీవల పరిహారం పంపిణీలో భాగంగా తనకు ఒక్క ఎకరానికి మాత్రమే చెక్కు అందజేశారని యాకయ్య వాపోయాడు.

వర్ధంతి సభలను నిర్వహించాలి

నర్సంపేట: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.ముక్తార్‌పాషా మూడో వర్ధంతి సభలను సెప్టెంబర్ 24నుంచి 30వ తేదీ వరకు గ్రామ గ్రామాన నిర్వహించాలని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి ఎలకంటి రాజేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో శుక్రవారం ముక్తార్‌పాషా వర్ధంతి సభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ ముక్తార్‌పాషా దేశవ్యాప్తంగా అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నాడని గుర్తు గుర్తు చేశారు. సెప్టెంబర్ 24వ తేదీన అల్లిగూడెంలో జరిగే పాషా వర్ధంతి సభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కృష్ణ, సాంబయ్య, సమ్మయ్య, సారంగపాణి, భద్రాజి, సుమన్, మధు, భిక్షపతి పాల్గొన్నారు.

బిట్స్‌లో పుస్తకావిష్కరణ

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నేపల్లి గ్రామ శివారు బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.పలనిసామి రచించిన మెంటినెన్స్ రిపెర్ అండ్ రిహాబిలిటేషన్ ఆఫ్ స్ట్రక్చర్స్ అనే పుస్తకాన్ని శుక్రవారం బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పుస్తకం ఉందని, మెంటినెన్స్ రిపేర్ అండ్ రిహాబిలిటేషన్ ఆఫ్ స్ట్రక్చర్స్ పుస్తకం ఎన్నో వ్యయ, ప్రయాలకు నిలిచి రాయడం అభినందనీయమన్నారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా కొత్త కోర్సులు నేర్చుకునే విద్యార్థులకు ఈ పుస్తకం చాలా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ వీఎస్ హరిహరన్, విద్యాసంస్థల సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, సురేష్, డాక్టర్ నారాయణ పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

నర్సంపేట: వరంగల్ ఎల్బీనగర్‌లోని అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 24వ తేదీన నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ముస్లిం డిక్లరేషన్ సభను విజయవంతం చేయాలని ముస్లిం నాయకుడు షేక్ జావీద్ కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 119నియోజకవర్గాల్లో 60లక్షలకు పైగా ముస్లిం జనాభా ఉన్నారన్నారు. 16శాతం కలిగిన ముస్లింలకు రాజకీయంగా చట్టసభలో ప్రాధాన్యత ఇవ్వకపోవడం విచారకరం అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా పార్టీలకు అతీతంగా 10ఎమ్మెల్యే స్థానాలు, మూడు ఎంపీ స్థానాలు, ఎమ్మెల్సీ స్థానాలు, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. 24వ తేదీన జరిగే సమావేశానికి ముస్లిం మేధావులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, విద్యావంతులు, నిరుద్యోగులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

‘దళితబంధు’ను అడ్డుకుంటున్నారు

చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లికి చెందిన దళితులకు దళితబంధు ఇవ్వకుండా బీఆర్‌ఎస్ నాయకులే అడ్డుకుంటున్నారని గ్రామ పార్టీ అధ్యక్షుడు అందె వెంకట్రాములుకు శుక్రవారం గ్రామానికి చెందిన దళితులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతుగా ఓట్లు వేయలేదని బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. దళిత కాలనీలో దళితులను రెండు వర్గాలుగా విభజించి తమకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. బాబు, స్వామి, వీరభద్రయ్య, వీరు, స్వామి ఉన్నారు.

రోడ్డు మరమ్మతు చేయాలని ధర్నా

గీసుకొండ: మనుగొండ నుంచి ఆత్మకూరు మండలం నాగయ్యపల్లెకు వెళ్లే రోడ్డును మరమ్మతు చేయాలంటూ దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు గండిపడి ధ్వంసం అయిందని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు తెలిపారు. రోడ్డు మరమ్మతు పనులు చేయించాలని డిమాండ్ చేశారు. పి.శంకర్, పులి కల్పన, చుంచు రాజేందర్ పాల్గొన్నారు.

‘రైతులపై ల్యాండ్ పూలింగ్ కత్తి ఉంది’

గీసుకొండ : ల్యాండ్ పూలింగ్ అనే కత్తి ఇంకా వేలాడుతూనే ఉందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరోమారు గెలిస్తే రైతుల భూములను లాక్కుంటుందని బీజేపీ జిల్లా నాయకుడు డాక్టర్ కాళీప్రసాద్ అన్నారు. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లలో శుక్రవారం జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విలువైన భూములను అమ్మడమే కాకుండా మద్యం వ్యాపారంతో ప్రజల జీవితాలను గుల్లచేస్తోందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి మాట్లాడుతూ గతంలో పేదల ఇళ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇస్తామని, రూ.3 లక్షలతో గృహలక్ష్మి అంటూ కొత్త పథకాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. కేంద్రం కోట్లాది రూపాయల అభివృద్ధి నిధులు ఇస్తుంటే.. అంతా తామే చేశామని బీఆర్‌ఎస్ నాయకులు సంబురాలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ నాయకులు బిల్ల రమేష్, రాదారపు శివకుమార్, రహ్మతుల్లా, ఆడెపు రమేష్, శేషాద్రి, భట్టు కుమారస్వామి, ఉప్పుగల్లు చంద్రమౌళి, పలువురు నాయకులు పాల్గొన్నారు.